## క్లుప్తంగా

### కంప్యూటర్లు, సౌండ్ సిస్టం అందజేత




మరిపెడ: స్థానిక విద్యాహెర్బ్స్ సంస్థ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్లు, సౌండ్ సిస్టంలను అందజేశారు. ఈసందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ రాజేష్ మాట్లాడుతూ.. ఇదే పాఠశాలకు గతంలో రూ.3లక్షలతో సభా వేదిక నిర్మించి ఇచ్చామన్నారు. రూ.లక్ష విలువచేసే కంప్యూటర్లు, సౌండ్ సిస్టం హెచ్‌ఎం అనంతరావుకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ శివకేమిశెట్టి, అకౌంటెంట్ వసంత్, కంపెనీ ప్రతినిధి శ్రావణ్, స్టాఫ్ సెక్రటరీ రామ్మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### డాక్టరేట్ ప్రదానం



కురవి: మండలంలోని రాజోలు శివారు పోలంపల్లి తండా గ్రామానికి చెందిన బాదావత్ రాజునాయక్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందాడు. రాజునాయక్ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటరమణ పర్యవేక్షణలో సోషియో, ఎకానమిక్ అండ్ పొలిటికల్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ట్రైబల్ ఉమెన్ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రస్తుతం ఆయన రైల్వేలో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

### కార్యవర్గ సభ్యుడిగా కరుణాకర్



మహబూబాబాద్ రూరల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గుండెపాక కరుణాకర్ నియామకం అయ్యాడు. టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మధుయాష్కీగౌడ్ సోమవారం కరుణాకర్‌కు నియామకపత్రం అందజేశారు.

### జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎల్లయ్య



నెల్లికుదురు: గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన బొల్లం ఎల్లయ్యను ఎంపిక చేసినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### గడువు పెంపు

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ ఐటీఐ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో ప్రవేశాలకు వివిధ కోర్సుల్లో సీట్ల భర్తీకి గడువును ఈనెల 30వ రకు పొడిగించినట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ డి.తిరుపతి సోమవారం తెలిపారు.

### సబ్‌స్టేషన్‌ను మరోచోట నిర్మించాలి

కేసముద్రం: మండల కేంద్రానికి కొత్తగా మంజూరైన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో కాకుండా, మహముద్‌పట్నం రెవెన్యూ పరిధిలో గల ప్రభుత్వ స్థలంలో నిర్మించాలని తహసీల్దార్ కార్యాలయంలో ఎంసీపీఐ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మొగిలి, బిచ్చానాయక్‌లు, ప్రతాపరావు, రాజేశ్వర్‌రావు, వెంకన్న, రమేశ్, శ్రీను, రాజు పాల్గొన్నారు.

### విజయవంతం చేయాలి

నెల్లికుదురు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 25న జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో చేపట్టే మాలల పాదయాత్రను విజయవంతం చేయాలని జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం పాదయాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, జిల్లా అధికార ప్రతినిధి చిట్టిమల్ల మహేష్, నాయకులు యాకయ్య, యాకాంతం, రమేశ్ పాల్గొన్నారు.

### నిధులు మంజూరు

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆస్పత్రిలో ఎట్టకేలకు పోస్టుమార్టం గది నిర్మాణానికి రూ.7.50లక్షలు నిధులు మంజూరైనట్లు సీహెచ్‌సీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. గార్లలో పోస్టుమార్టం గది నిర్మించాలని ఇటీవల 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. అదే విధంగా ఆస్పత్రిలో కిచెన్‌షెడ్ నిర్మాణానికి రూ.5లక్షలు, తాగునీటి ఆర్‌ఓ ప్లాంటు నిర్మించేందుకు రూ.2.50 లక్షలు మంజూరైనట్లు ఆయన వెల్లడించారు.

### ఆర్థికసాయం

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు షేక్ అబ్బాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కిసాన్ పరివార్ బృందం రూ.10వేలు ఆర్థికసాయాన్ని సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు హరిబాబు, గణేష్, శంకర్ నాయక్, వెంకన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# పాలకవర్గ నియామకం ఎప్పుడో?

- రెండేళ్లుగా మార్కెట్ నిర్వహణ అధికారుల చేతుల్లోనే..
- నిలిచిన కొనుగోళ్లు, అమ్మకాలు



తొర్రూరు వ్యవసాయ మార్కెట్

తొర్రూరు రూరల్: పాలకుర్తి, మానుకోట, మరిపెడ నియోజకవర్గాల పరిధిలోని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ నియామం ఎప్పుడు చేపడతారేమో అని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా గత బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వంలోనే ఏడాది కాలం, కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో మరో ఏడాది చొప్పున రెండేళ్లగా పాలకవర్గాన్ని భర్తీ చేయలేదు. దీంతో మార్కెట్ అధికారుల చేతిల్లోనే పాలకవర్గ నిర్వహణ కొనసాగుతుండడంతో వ్యవసాయ మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాలు రెండేళ్లగా పూర్తిగా నిలిచిపోయాయి. తొర్రూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని ప్రభుత్వం త్వరలో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ప్రధానంగా మార్కెట్ చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు డైరెక్టర్లు వంటి పదవుల కోసం మూడు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా పోటీపడుతున్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు మండలానికి చైర్మన్ పదవి, మరిపెడ నియోజకవర్గంలోని దంతాలపల్లి మండలానికి వైస్ చైర్మన్ పదవి, నెల్లికుదురు మండలానికి ఎక్కువ సంఖ్యలో డైరెక్టర్ పదవులను ఇచ్చే విధంగా ప్రజాప్రనిధులు మధ్య ఒప్పందం జరిగినట్లు సమాచారం.

## 'నమ్మిన ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్'


కురవి: మాట్లాడుతున్న రెడ్యానాయక్

కురవి: గత ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీలను నమ్మిన ప్రజలు ఓట్లేసి గెలిపించారని, నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వమని చెప్పడాన్ని నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం కురవి గుడి సెంటర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు తోటలాలయ్య అధ్యక్షతన జరిగింది. నేరడ క్రాస్ రోడ్డు నుంచి గుడి వరకు ర్యాలీ నిర్వహించగా ర్యాలీలో రెడ్యానాయక్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుగులోత్ రవినాయక్, గుడిబోయిన రాంచంద్రయ్య, నామా సైదులు, నూతక్కి నర్సింహరావు, బాదె నాగయ్య పాల్గొన్నారు.

**'రైతు భరోసా' విడుదల చేయాలి**

నర్సింహులపేట: ప్రభుత్వం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఆందోళన చేశారు. అనంతరం డీటీ సంజీవకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దేవేందర్, బండి రమేశ్, నాగన్న, కాలునాయక్ పాల్గొన్నారు.

### బాలిక ఆత్మహత్యాయత్నం

గార్ల: 10వ తరగతి చదువుతున్న బాలిక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం గ్యామాతండాలో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గార్ల మండలం మర్రిగూడెం పంచాయతీ గ్యామాతండాకు చెందిన భూక్యా అఖిల గార్లలోని బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. రోజు మాదిరిగానే పాఠశాలకు వెళ్లే క్రమంలో తల్లి మందలించిందని ఇంట్లో పురుగుమందు తాగి పాఠశాలకు వచ్చింది. 2గంటల తర్వాత కడుపులో తిప్పుతుంది, పురుగుమందు తాగాను అని తోటి స్నేహితులకు చెప్పడంతో హెచ్‌ఎం సుందర్‌కుమార్ సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. బాలిక పరిస్థితి విషమంగా ఉండడంతో 108 సహాయంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

### వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

దంతాలపల్లి: ఉపాధ్యాయుల డీఏలు, పీఆర్‌సీ పెండింగ్ బిల్లుల సత్వర పరిష్కారం కోరుతూ.. ఈనెల 23న టీపీయూఎస్(తపస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిర పార్కు వద్ద తలపెట్టిన దీక్షను విజయవంతం చేయాలని సంఘం మండల అధ్యక్షులు బండ శ్రీనివాస్ రెడ్డి తెలిపాడు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈఓ శ్రీదేవితో కలిసి దీక్ష పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మహేందర్, హరిబాబు, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.,

# రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కురవి: ఈనెల 19న డోర్నకల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, రగ్బీ పోటీలకు మండలంలోని బలపాల జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పది మంది విద్యార్థులు ఎంపికైనట్లు సోమవారం పాఠశాల పీఈటీ శ్రీనివాసులు తెలిపారు. అండర్-14 విభాగం బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో ఆర్.శ్రీలక్ష్మీ ప్రసన్న, దీపిక, ఎస్‌కె.కరిష్మా, బి.కీర్తి, బాలుర విభాగంలో జె.నందకిశోర్, ఆర్.రాహుల్, ఎం.సాయికిరణ్, ఎల్.యశ్వంత్ ఎంపికయ్యారు. అలాగే అండర్-17 రగ్బీ పోటీలో కె.ఉదయ్‌కుమార్, అండర్-14 విభాగం రగ్బీలో కె.సన్ని ఎంపికయ్యాడు. హెచ్‌ఎం కె.నర్సింహరెడ్డి, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, బీవీ ప్రసాద్, గోపికృష్ణ, సీతారాములు, జయశ్రీ, మోతీలాల్, షకీరాబేగం, రాజేశ్వర్ అభినందించారు.

### రాష్ట్రీయ ఆజాద్ హింద్ ఫౌజ్ దివస్

నెహ్రూసెంటర్: నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా రాష్ట్రీయ ఆజాద్ హింద్ ఫౌజ్ దివస్ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కేంద్రంలోని నేతాజీ విగ్రహం వద్ద ఆజాద్‌హింద్ ఫౌజ్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాలోత్ రవీందర్ మాట్లాడారు. కార్యక్రమంలో నేజాతి సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ కందుల నాగరాజు, కుదురుపాక వివేక్, మైస రోహిత్, గంగాధర్ పాల్గొన్నారు.

# ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


గెలుపొందిన కబడ్డీ జట్టు

గార్ల: యువత చెడు అలవాట్లను వీడి, సన్మార్గంలో పయనిస్తూ ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు అన్నారు. సోమవారం4జిల్లాలస్థాయి కబడ్డీ, డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రిటైర్డ్ రైల్వే ఉద్యోగి కస్నానాయక్ చేతుల మీదుగా బహుమతి ప్రదానోత్సవం చేశారు. కబడ్డీలో గోరిమెళ్ల జట్టు ప్రథమస్థానం కైవసం చేసుకోగా, అశోక్‌నగర్ జట్టు ద్వితీయస్థానం గెలుచుకుంది. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ మార్కెట్ చైర్మన్ భూక్యా నాగేశ్వరరావు, టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరు నాయక్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మండ రాము, జర్పుల లచ్చిరాంనాయక్, కందునూరి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను అమలు చేయాలి


తొర్రూరు: మాట్లాడుతున్న శ్రీనివాస్

తొర్రూరు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదులు శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. తొర్రూరు పట్టణ కేంద్రంలోని సోమవారం పార్టీ కార్యాలయంలో జన్నపురెడ్డి సోమిరెడ్డి అధ్యక్షతన సమావేశం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎండి యాకుబ్, జిల్లా కమిటీ సభ్యులు అశోక్, తొర్రూరు మండల కమిటీ సభ్యులు సాయిమల్లు, మార్క సాంబయ్య, శ్రీనివాస్, దర్గయ్య పాల్గొన్నారు.

నెల్లికుదురు: హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు గునిగంటి రాజన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఎం గ్రామశాఖ మహాసభ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నెల్లికుదురు గ్రామ శాఖ అధ్యక్షుడుగా తోట యాకయ్యను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు తెలిపారు.

# చట్టం ఉల్లంఘించి రియల్ ఎస్టేట్ వ్యాపారం



ఆర్డీఓకు వినతిప్రతం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్: గిరిజన షెడ్యూల్ ప్రాంతమైన పెద్దగూడూర్ మండల కేంద్రంలో పీసా చట్టాన్ని ఉల్లంఘించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమా నాయక్ డిమాండ్ చేశాడు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ అలివేలుకు నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా భీమానాయక్ మాట్లాడుతూ.. భూములు బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్న వాటికి అనుమతులు ఇచ్చిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులపై వారికి సహకరించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చందులాల్, రాందాస్, శివవర్మ, తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం


ఫిర్యాదు అందజేస్తున్న గ్రామస్తులు

చిన్నగూడూరు: విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ ఎన్.వి వేణుగోపాల్ చారి తెలిపారు. చిన్నగూడూరు, మరిపెడ, ఎల్లంపేట, నర్సింహులపేట సెక్షన్స్‌కు సోమవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టును నిర్వహించారు. కార్యక్రమంలో టెక్నికల్ మెంబర్ రమేశ్, చరణ్‌దాస్, రామారావు, ఎస్‌ఈ నరేష్, డీఈ మధుసూదన్, టెక్నికల్ ఏఈ జయప్రకాష్ నారాయణ, ఏఈ నవ్య పాల్గొన్నారు.

# తైక్వాండోలో బంగారు పతకాలు



మహబూబాబాద్ రూరల్: పతకాలు సాధించిన క్రీడాకారులు

మహబూబాబాద్ అర్బన్: వరంగల్ జిల్లాలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన తైక్వాండో ఎస్‌జీఎఫ్ అండర్-17లో జిల్లా కేంద్రానికి చెందిన నందిని, నిఖిల్, సచిన్ బంగారు పతకాలు సాధించినట్లు కోచ్ లావుడ్య రాంబాబు సోమవారం తెలిపారు. ఈనెల 23, 24న జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

మరిపెడ రూరల్: ఈనెల 20న వరంగల్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి తైక్వాండో అండర్-17 పోటీలో మరిపెడ మండలం ఎల్లంపేట హైస్కూల్ విద్యార్థిని జి.శ్రీనిత జిల్లాస్థాయి తైక్వాండోలో బంగారు పతకం సాధించింది. శ్రీనిత గద్వాల ఇండోర్ స్టేడియంలో జరిగే పోటీలకు ఎంపికై నట్లు హెచ్‌ఎం బి.భాస్కర్ రావు తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో కోచ్ కల్లెపల్లి రమేశ్, ఉపాధ్యాయులు వెంకటేష్, వీరేందర్, ఐనాల నవీన్, రమేష్, మధుకర్ అభినందించారు.

# పోలీసు అమరులకు ఘన నివాళి


తొర్రూరు: అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు


డోర్నకల్: కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


నెల్లికుదురు: మండల కేంద్రంలో..

పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరులకు నివాళులర్పించారు. అనంతరం పలువురు పోలీసులు మాట్లాడుతూ.. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలన్నారు.

– డోర్నకల్/తొర్రూరు/నెల్లికుదురు/నర్సింహులపేట

### గ్రంథాలయంలో వసతులు కల్పించాలి

డోర్నకల్: మండలంలోని గొల్లచర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో వసతులు కల్పించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కోకన్వీనర్ గంధసిరి జ్యోతిబసు కోరారు. గొల్లచర్ల గ్రామంలోని గ్రంథాలయాన్ని సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల బృందం పరిశీలించి వసతులు కల్పించాలని కోరుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శికి వనతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో హరిచంద్, వివేక్, హరిదాస్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**రైతులు జాగ్రత్తలు పాటించాలి**

డోర్నకల్: వరి సాగు చేసే రైతులు వరి పంట కోత, నూర్పుడు, ధాన్యాన్ని ఆరబెట్టే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సీరోలు మండల వ్యవసాయ అధికారి ఛాయారాజ్ తెలిపారు. సీరోలు మండలం మన్నెగూడెం గ్రామ రైతువేదికలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు.

**అవార్డు ప్రదానం**



మహబూబాబాద్ రూరల్: హైదరాబాదులోని బిర్లా భాస్కర ప్లానిటోరియం ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని కంబాలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయుడు కాసం శ్రీనివాసరావుకు టీచర్ ఎక్సలెన్సీ అవార్డు అందజేశారు.

**ఓటరుగా నమోదు చేసుకోవాలి**

కేసముద్రం: ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా కేసముద్రంస్టేషన్, కల్వల జెడ్పీహైస్కూల్స్‌లో, మోడల్‌స్కూల్, మహముద్‌పట్నం కేజీబీవీలలో పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఓటర్‌గా నమోదు చేసుకోవాలని సోమవారం కోరారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మిర్యాల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

**స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి**

తొర్రూరు: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంగాధరి సిద్దు అన్నారు. డివిజన్ కేంద్రంలోని బస్‌స్టాండ్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో మహేష్, రవి, గణేష్, మనోజు, కార్తిక్, సాయి, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

**హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్సీ**



మహబూబాబాద్: హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావును సోమవారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ మర్రిరంగారావు మర్యాద పూర్వకంగా కలిశారు. మానుకోట నియోజకవర్గం పార్టీకి సంబంధించిన పలు విషయాలపై చర్చించినట్లు తెలిపారు.

**సంతకం ఫోర్జరీ**

గూడూరు: మండల కేంద్రంలోని బహుళ అంతస్థుల యజమానులకు ఇచ్చిన నోటీసులలో ఎల్‌హెచ్‌పీఎస్ పేరుతో ఏపూరుకు చెందిన బానోతు చందూనాయక్ తన పేరు రాసి, సంతకాన్ని ఫోర్జరీ చేశాడని, ఆయనకు తనకు ఎలాంటి సంబంధం లేదని చెంద్రుగూడెంకు చెందిన బానోతు లాలూనాయక్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన ట్రైబల్ అండ్ నాన్ ట్రైబల్ కన్వీనర్ కత్తి స్వామి కలిసి ఆందోళన వ్యక్తం చేశాడు.

**పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత**



గూడూరు: మండలంలోని అయోధ్యపురానికి చెందిన రేవంత్, లక్ష్మినారాయణ, రామ్‌ధన్, సరోజ అనే నలుగురు వ్యక్తులు కొన్ని రోజుల క్రితం ఫోన్లను పోగొట్టుకున్నారు. వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో మొబైల్‌లను గుర్తించి వారికి అప్పగించినట్లు సీఐ కె.బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. కానిస్టేబుల్ బి.సుమలత పాల్గొన్నారు.

**క్రీడల్లో రాణించాలి**

కేసముద్రం: క్రీడల్లో రాణిస్తే వారికి బంగారు భవిష్యత్ ఉంటుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రంగాపురం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. గెలుపొందిన కేసముద్రం జట్టుకు మొదటి బహుమతి, రంగాపురం జట్టుకు ద్వితీయ బహుమతిని ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్‌యాదవ్, మహేందర్, యాకుబ్ పాల్గొన్నారు.

**యువకుడి అదృశ్యం.. కేసు నమోదు**



నెల్లికుదురు: మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన వనగండ్ల ఉమేష్(25) అదృశ్యమైనట్లు ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17న వరంగల్‌కు కూలి పనుల కోసం వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి ఇంటికి రాలేదన్నారు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఉమేష్ ఆచూకీ లభించలేదని, అతని సోదరుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

**సమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యం**

నెహ్రూసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాతోనే సాధ్యమని సీపీఎం నాయకుడు అల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్టీ జ్యోతి బసునగర్‌శాఖ మహాసభ సోమవారం నిర్వహించారు. అకాల వర్షాలు, వరదలకు నష్టపోయిన ప్రజలను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో రాజమౌళి, యాకయ్య, హేమానాయక్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

### ఎన్నికల షెడ్యూల్ విడుదల

తొర్రూరు: డివిజన్ కేంద్రంలో వ్యాపార, వాణిజ్య వర్గాల సంస్థ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ పంజాల ఉపేందర్ తెలిపారు. తొర్రూరులోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే వారు సంఘం కార్యాలయంలో 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలకు వరకు తమ వివరాలను అందజేయాలని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన ఉపసంహరణ, అదే రోజు 6గంటలకు తుది జాబిత విడుదల చేస్తామన్నారు. 28న ఎన్నికల అనంతరం 3 గంటలకు ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

### ఏజెన్సీ చట్టాలను హేళన చేస్తే సహించం

గూడూరు: ఏజెన్సీ చట్టాలను హేళన చేస్తే సహించేది లేదని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. కొంతమంది వలసవాద గిరిజన, గిరిజనేతరులు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఏజెన్సీ చట్టాలపై ప్రకటనలు చేస్తున్నారన్నారు. అలాంటి వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ మండల తుడుందెబ్బ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సారయ్య, సునీల్, కిరణ్ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మద్దిరాల: బైక్‌పై వెళ్తున్న యువకుడు గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మద్దిరాల మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బునాలపురం గ్రామానికి చెందిన ఆంబోతుల ప్రశాంత్(27) నూతనకల్ మండలం తానంచర్లలోని పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని తన అత్తగారి ఊరైన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా.. మద్దిరాల మండల కేంద్రంలోని 365జాతీయ రహదారిపై భారత్ పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతిచెందాడు.

### ఐడీ నంబర్లు వెంటనే ఇవ్వాలి

మహబూబాబాద్: నూతన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఎంప్లాయిస్ ఐడీ నంబర్స్ వెంటనే ఇవ్వాలని యూటీఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకుబ్ డిమాండ్ చేశాడు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఖజానా అధికారి కార్యాలయంలో డీటీఓ సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్టీఓ కార్యాలయంలో కొంత మంది డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వారిపై చర్య తీసుకోవాలన్నారు.

### చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కేసముద్రం: చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఎస్సై మురళీధర్‌రాజు అన్నారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుజాత, రమేశ్, విష్ణువర్ధన్, సునీత పాల్గొన్నారు.